# అద్దం

కె.రామలక్ష్మి



# అద్దం

(కథా సంకలనం)

రచన

**కె. రామలక్ష్మి**

**స్త్రీ శక్తి ప్రచురణలు**

304, శ్రీ సాయి అపార్ట్‌మెంట్స్, ఓల్డు ఆర్.టి.ఎ. రోడ్, ఆస్మాన్‌గడ్

న్యూ మలక్‌పేట, హైదరాబాద్-500 036. ఫోన్ : 91-040-24162885

**అద్దం** (కథల సంపుటి 2)

© కె. రామలక్ష్మి

మొదటి ముద్రణ : 2007

వెల : రూ. **100/-**

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్ - 500001.

ముఖచిత్రం
నర్సిం

డి.టి.పి
అనురాధా రఘురామ్
ఫోన్ : 040-27621155/9441186831

ప్రింటర్స్
గాయత్రి గ్రాఫిక్ పాయింట్
హైదరాబాద్ - 500 044

# నేను - నా కథలు - వాటి ధోరణి

నేను చదువుకునే రోజుల దగ్గిర నుంచి ఆంగ్లసాహిత్య పఠనం అభిమాన విషయమే. తెలుగు అంతగా చదవలేదు. తరవాత, స్వతంత్ర పత్రిక కార్యాలయం – ఎప్పుడూ కవులతో కథకులతో సాహితీవేత్తలతో హడావిడిగా వుండేది. వారి సాహిత్యం చర్చలు రణరంగాన్ని తలపించేవి. అందుకే నాకు స్త్రీ రచయితలకంటే మగవారే ఎక్కువ పరిచయం.

ఎప్పుడేనా ధైర్యంచేసి చిన్న స్కెచ్‌గాని కథగాని రాసి ఎడిటరుకిస్తే... సాయంత్రం వచ్చిన యీ కవిమిత్రులతో కూర్చుని పైకి చదివి – దాన్ని చీలికలు వాలికలుగా చీల్చి చండాడేవారు సంపాదకులు. నచ్చకపోతే చింపేసేవారు. బాగుంటే మెచ్చుకుందుకు తగ్గేవారూ కాదు. “రాసేటప్పుడు ప్రతి విషయం ఆశ్చర్యం కాదు; ఆలోచన సాగుతోందన్నట్టు చుక్కలు రాయక్కరలేదు.” అంటూ ఆశ్చర్యార్థకాలూ, చుక్కలూ శూన్యంలోకి చూడ్డాలూ నిర్దాక్షిణ్యంగా నలిపి పారేయమనేవారు. దాంతో నాకు కాస్త పదిపేజీల కథ కూడా రాయడానికి కాస్త జంకుగా వుండేది. సరదా కథలు రాయకూడదా అని కొడవటిగంటి కుటుంబరావు నడిగాను కూడా.

నేను తొలిరోజుల్లో కొన్ని ప్రేమకథల్లాంటివి రాసేదాన్ని. కాని కొడవటిగంటి కుటుంబరావుగారు, మల్లాదివారు పద్మరాజుగారు, భాస్కరభట్ల, శ్రీవాత్సవ లాంటివారు అంతా ఇవెందుకు? కాస్త విలువైన కథలపై దృష్టిపెట్టు అంటూండేవారు. విలువ అంటే ఓసారి నేను బైరాగిని అడిగాను. “ఏం లేదు రామలక్ష్మీ, కొన్నాళ్ల తరవాత నువ్వు రాసిన వాటికి నువ్వే సిగ్గుపడకుండా వుండగల్గినవి” అన్నాడు నవ్వుతూ. ఇలా ‘నీచేతను – నాచేతను’ అన్నట్టు అందరివల్లా నాకు – ఏదిపడితే అది రాసే ధైర్యం రాలేదు.

మనసు అన్యాక్రాంతమైనప్పుడు ఆధునిక వనిత భావనలు ఎలా వుంటాయో, పార్వతి అలాంటి ఆధునిక వనిత. ఆమె సరదాలు, అభిరుచులు, దృక్పథం –

పరాధీనం కాదు. తనదే. ఈ కథలు రాయడం మొదలుపెట్టాక – నాకే ఆశ్చర్యంగా – అందరికీ అమితంగా నచ్చాయి. మల్లాదివారైతే 'చూడముచ్చట వారి కలహాలూ ప్రణయాలూ. అన్నీ చూడసొంపుగా వున్నాయి. మొగుడిని మడతపెట్టి దాచుకో కల్గడమేకాదు. ఈ విషయం అతగాడికే తెలియనీయనంత జాణ కద పార్వతి. రాస్తూ వుండు' అన్నారు. అప్పటినుంచి నా రచనా ధోరణికి కొత్త రంగు రుచి వాసన వచ్చాయి అనుకుంటాను.

వయసుతోపాటు సంసారంలో భార్యాభర్తల మధ్యేకాదు పిల్లలతో కూడా సాన్నిహిత్యం పెరగాలనీ, ఇది – అర్థవంతమైనదీ, పిల్లలు సహితం భార్యాభర్తల – ఈ సాన్నిహిత్యానికి విలువ యివ్వడం నేర్చుకోవాలనీ నా అభిప్రాయం. అది ఆచరణలో పెట్టి నేను జీవితాన్ని విజయవంతం చేసుకున్నాననిపిస్తుంది నాకు.

సమాజసేవా కార్యక్రమాల పట్ల నా ఉత్సాహం ఎక్కువ కావడంతో నా దృక్పథంలో కాస్త మళ్లీ మార్పు వచ్చింది. నాకు ముఖ్యంగా బాధితులతో కూర్చుని మాట్లాడడం పట్ల ఎక్కువ కుతూహలం వుండేది. మనని ఆశ్చర్యంలో ముంచే జీవితాలు వింటూ వుంటే – మనకెంత తక్కువ తెలుసో – అనిపించేది. సరదా కథలు, ఏడుపు కథలు, హాస్యం, ఎత్తిపొడుపులు, సాధింపుల కథలు నాకు తెలియకుండానే తగ్గిపోయాయి. స్త్రీవాదన, ఫెమినిజమ్, ఆడమగల పోటీ జీవితాలు – శరీరాలపై హక్కులు, ఆంక్షలు – ఇలాంటివి నేను రాయలేకపోయాను. మనకై మనం తీసుకున్న నిర్ణయాలు, వాటి తాలూకు ఫలితాలు – మనమే ఎదుర్కోవాలి. వీటికి పైవారిని బాధ్యులను చేయడం, అర్థం లేని పని. ఆడ మగా నాణేనికి రెండు పక్కలైనప్పుడు – రెండింటి విలువా ఒకటే కదా! ఒకవైపు విలువలేనిదని – ఎవరేనా అన్నా – ఆడది నమ్మడం ఏమిటి? అర్థం వుందా? అందుకే – మనం మంచో చెడో స్వంతంగా నిర్ణయం చేసుకుంటే – దాని ఫలితాలు మనం అనుభవించాలి – ఎవరినీ బాధ్యులని చెప్పడం అర్థంలేని పని అని నేను గట్టిగా నమ్మే సూత్రం. యీ సూత్రానికి ఆడా మగా తేడా ఎలా వుంటుంది? అందుకే యీ పోటీ కథలు నేను రాయలేకపోయానేమో అనుకుంటా. బహుశా యీవిధంగా కూడా నాకు తెగించిన అభ్యుదయ ముందుతరం, స్వేచ్ఛావాద రచయిత్రిగా పేరూ రాలేదు, గుర్తింపూ రాలేదు. అదో పెద్దలోటని నేను ఎప్పుడూ అనుకోలేదు.

జీవితం నవ్వుతూ తుళ్లుతూ చాలామందికి సాగదు. నవ్వుముఖాల వెనుక ఏమున్నదీ మనం వూహించలేం. దాంపత్య సంబంధాల మధ్య బీటలు అనేకం.

వాటిని దాచుకుని కాపురాలు సాగించాలని తాపత్రయపడేవారే ఎక్కువ. డబ్బుంటే చాలదు – సుఖంగా జీవించడానికి. ఇంకా చాలా కావాలి..... ఇవన్నీ గుర్తించడం మొదలుపెట్టాక – చాలా తేలికగా రాసేయం – చాలా కష్టం అనిపించింది.

నేను పనిచేసిన రంగాలు, పలురకాల సేవాసంస్థలు, మానసిక రోగులు – ఎవరికీ అక్కరలేని మనుషులు – ముఖ్యంగా ఆడవాళ్లు. ఫాండిలింగ్ ఆస్పత్రులు (పారేసిన యీ పిల్లలు ఎవరికో పుట్టినవాళ్లే కదూ అనేవారు మిస్ మంజుభాషిణిగారు. తొలి సంస్థ యీమే స్థాపించారు.) వికలాంగుల స్కూలు (దీన్ని శ్రీమతి లక్ష్మీపార్వతిగారు మహిళా సభ ఆవరణలో స్థాపించి – పెంచి పెద్దది చేసిన గొప్ప మనసు గల్గిన మహిళ)... ఇటువంటి సంస్థలతో సాన్నిహిత్యం పెరిగి సరదాగా “సంఘసేవ చేయడం” అన్న దృక్పథం మారిపోయింది. సరదా తగ్గిపోయింది కూడా.

నాలాంటి ఉత్సాహవంతులని కాళ్లు కాస్త నేలూని, తల కాస్త భుజాలపైనే వుండేలా చేసినది మంచి మిత్రురరాలు శాంతాబాయి. కలిసి చదువుకున్నాం. డబ్బులేక నేను పైచదువుల జోలికి పోలేదు. శాంత లాయరైంది. అదీ క్రిమినల్ సైడు. ‘ప్రతీచిన్న విషయానికీ అంత ఆశ్చర్యపడిపోకు. ఆలోచిస్తే ఏవీ అంత గొప్ప విషయాలు కాదు. విన్నదాని గురించి క్షణం ఆలోచించు. మంచి చెడు లేవీ మానవ సంబంధాలను దాటి వుండవు’ అనేది. నా కథారచనలో ఓర్పు, సహనం, ధైర్యం నీతి న్యాయం – అనే ఆలోచనలు పాదుకున్నాయంటే – అందుకు కారణం లాయర్ శాంతే. అందుకే ఈమధ్యే కాలం చేసిన నా మిత్రురాలి జ్ఞాపకంగా ఈ కథానికా సంపుటిని – తీసుకురావాలనే ప్రయత్నం చేశాను. దీనికి శాంత సోదరుడు పందిరి కృష్ణమోహన్ శాంత సన్నిహితురాలు శ్రీమతి రమణి సంతోషంగా – ఎంతో సహకరించారు. నేను ఎంపిక చేసిన కథలని రెండు సంపుటాలుగా తేవాలని సిద్ధం చేశాను. పుస్తకాలు రచయితలే అచ్చువేసుకోవలసిన దౌర్భాగ్యం వున్న యీదేశంలో యీపని చేతిచమురు భాగోతమే. తెలుసుకాని పాత కాగితాలని ఒదుల్చుకోవాలంటే – యీపని చేయాలి. నా కథలు చాలా మటుకుపోయాయి. మిగిలిన వాటిలోంచి కొన్ని ఎంపిక చేశాను. కొన్ని మంచివి, నాకు నచ్చినవి, చదివిస్తామని పట్టుకెళ్లినవారు తిప్పి ఇవ్వడం సహజంగానే మరిచిపోతారు కదా. అలా నాకు నచ్చిన ఈ ‘ఒక జీవికి స్వేచ్ఛ’ అనే కథను అభిమానంతో ‘రాజీకి సమయం’ అన్న మంచి కథ కూడా లేదు. ఎలాగేనా సేకరించి పంపే ప్రయత్నం చేస్తానన్నారాయన.

అసలీ రోజుల్లో యీ కథలు చదవడానికెవరికైనా కుతూహలం వుంటుందా అన్నది నాకు అనుమానమే.

చాలారోజులనుంచి నా మంచి మిత్రురాలు – కథారచయిత్రి, విజయలక్ష్మి రామకృష్ణన్ – నన్నేం అడగవు, నా సహాయం తీసుకుందుకు ఇష్టపడవు అంటూ నిష్ఠూరాలు పల్కింది. అందుకే యీ కథానికా సంపుటి ప్రచురణ ఆమె సహకారంతో తెస్తున్నాను. అభిమానించే మిత్రులే కదా నాలాంటి వారి ఆస్థి. దన్ను.

బాపుగారు ఎంతో పనిలో వుండి నాకీ ముఖచిత్రం వ్రాసి పంపారు. మా దంపతులపై ఉన్న అభిమానం అలాంటిది. కృతజ్ఞురాలిని.

ఈ కథల సంపుటి డి.టి.పి. చేసినది – నేను అభిమానించే అనూరాధా రఘురామ్. ఏది చేస్తున్నా విషయం ఆస్వాదిస్తూ చేస్తుంది. అదే సగం బరువు నా భుజాలపైనుండి తీసేసినట్టుగదా. ఆమెకి నా థాంక్స్.

ఈమధ్య యీ పాతకట్టింగ్స్, వదుల్చుకునే ప్రయత్నంలో – యీ రెండు కథల సంపుటులు రూపొందించాను. ఇటువంటి భారం పిల్లలపై వదలడం – భావ్యం కాదు. వారి జీవితాలు, వ్యాపకాలు వారికి వుంటాయి. నా పిల్లలు బంగారు తల్లులు. నా నిజమైన సంపద వారే.

జీవితాన్ని వెనక్కి తిరిగి చూసి తప్పులు దిద్ది తిరగరాయలేం కదా. అందుకే ముందుకే చూడడం అలవాటు చేసుకున్నా. ఇప్పటిదాకా సాగి వచ్చినంత దూరం – సాగవలసి వుండదుకదా?... ఈవిషయం నాకెప్పుడూ సంతోషమే కల్గిస్తూంది.

ఈ కథల సంపుటి చదివి – ఆలోచిస్తారని పాఠకులను కోరడం లేదు. తిరగేసి చూసినా నాకు తృప్తే. ఉంటాను.

మీ

కె. రామలక్ష్మి

20-3-2007

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అందమైన పొరుగు | 23 |
| 2. | అద్దం | 31 |
| 3. | అబద్ధాల తేనెపట్టు | 38 |
| 4. | అవిటిమనసు | 46 |
| 5. | ఆడతనం | 58 |
| 6. | ఆదుర్దా | 66 |
| 7. | ఊగిసలాడిన హృదయాలు | 73 |
| 8. | ఏకోన్ముఖులు | 85 |
| 9. | కలిమిచెట్టు - నీతి | 96 |
| 10. | కావలెను వధువు | 106 |
| 11. | కొత్తమూకుడు | 115 |
| 12. | కోరిక చిన్నదే, కానీ | 126 |
| 13. | చిట్టి | 133 |
| 14. | నిజంకంటే సాక్ష్యం ముఖ్యం | 150 |
| 15. | నోనో ప్లీజ్ | 155 |
| 16. | పాశం | 166 |
| 17. | పిచ్చివాడి పెళ్ళాం | 179 |
| 18. | బిగినర్స్‌లక్ మిథ్య | 186 |
| 19. | మమకారం | 196 |
| 20. | మేనరికం | 206 |
| 21. | మొగుడు భాగోతం | 213 |
| 22. | వర్కింగ్ వైఫ్ | 219 |
| 23. | వివాహబంధం | 229 |
| 24. | వృత్తి సంఘసేవ | 235 |
| 25. | వృధా కన్నీరు | 244 |
| 26. | సత్యం దాగదు | 250 |
| 27. | స్వార్థంలో కూడా అర్థం వుంది | 276 |
| 28. | హృదయంలేని పట్నం | 285 |

# అందమైన పొరుగు

పార్వతి అలసిపోయింది. దాన్లో ఆశ్చర్యం లేదు. అది మామూలే! కాని మామూలుగా ఒక రకం స్తబ్ధత ఆవరించింది పార్వతి మనస్సుని. కృష్ణమూర్తికి పరస్తుతి ఎక్కువయినకొద్దీ పార్వతికి ఆత్మనింద ఎక్కువవుతుంది. ఈమధ్య ఇదే జరుగుతోంది. భర్తనీ పిల్లలనీ అపరిమితంగా ప్రేమించింది. 'దాని ఫలితమేనా ఇది?.... అనుకుంటూ దారికడ్డుగా పడివున్న క్రిక్రెట్టుక్కు, సైకిలు, కాగితాలు, పెన్సిళ్లు, పాతగుడ్డలు... అన్నీ ఒకటొక్కటే తీసి వాటి వాటి స్థానంలో పెట్టింది పార్వతి. కాస్సేపు అమ్మదగ్గిర కూర్చుని రావాలి అనుకుంది. "ఈ ఇంట్లోవాళ్లు నన్నేం అనుకుంటున్నారో – అతి నేర్పుగా వంటచేసి తమ సదుపాయాలు చూసే మరమనిషి అనుకుంటున్నారేమో" అని వింతపడింది.

వీధి తలుపు గడియవేసి తాళం వేసింది. మెట్లుదిగి గేటు దాటింది. వీధిలోకి వస్తూనే పక్కింటికేసి ఒకసారి చూసింది. అలా ఎప్పుడు చూసినా పార్వతి మనసు కించపడుతుంది. చక్కని చిన్నతోట పెంచింది పక్కింటి సుభద్రగారు. బారులు తీరిన పూలమొక్కలు చక్కగా పూసి ఎంతో అందంగా వున్నాయి. ఎప్పుడూ కృష్ణమూర్తి అంటూ ఉంటాడు. ఆడదే అయినా తోట చూడు ఎంత అందంగా ఉంచుతుందో" అని శని ఆదివారాలలో తోటలో ఎండిన పూలు కోసిపారేసే సుభద్రగారి నేర్పు పార్వతికి తెలియనిది కాదు. వారం పొడుగునా తోటవాడు పని చేస్తాడు అని కృష్ణమూర్తికి చెప్పాలనుకుని ఊరుకుంది పార్వతి.

పార్వతికా తోటపని బాధేలేదు. పెరట్లో పువ్వుల మొక్కనేది తలెత్తదు. ఒకవేళ ఏదైనా మొక్క వచ్చినా దాని వేళ్ళు ఎలా వున్నాయో పీకి చూసి తీరతాడు నానిగాడు. రోజూ వాడికదేపని. పక్కింటి సుభద్రగారికి పెళ్ళి అయిందో లేదో తెలియదు. ఒంటరిగానే వుంటుంది. ఏదీ ఉద్యోగం చేస్తున్నట్టు కూడా లేదు. కాని బయటికి వెళ్ళి వస్తూనే వుంటుంది.

పక్కింటి తోటకేసి చూసి మనసులోనే ఉసూరుమన్నా, పార్వతి బస్సుస్టాండు దగ్గిరికి వచ్చేసరికి మామూలు స్థితికి వచ్చింది. బస్సుకోసం వేచివున్న సుభద్రగారిని చూసి "కొంచెం మంచి చీర కట్టుకుని ఉండవలసింది నేను కూడా" అనుకుంది పార్వతి.

"ఏమిటీ మీరూ బయలుదేరారు?" ఆశ్చర్యంగా అడిగింది సుభద్రగారు.

'అమ్మ ఇంటికని' నెమ్మదిగా అంది పార్వతి.

"నేనలా బాలమందిర్‌లో పిల్లల్ని చూసివద్దాం అని బయలుదేరాను. అబ్బ! ఎంత ముద్దొస్తుంటారండీ' అంది సుభద్రగారు.

ఆ పిల్లలంటే అంత ఇష్టమైతే తన కుటుంబమే విస్తరించుకోవచ్చుగా' అనుకుంది పార్వతి.

'మిమ్మల్ని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇంట్లో క్షణం విశ్రాంతి ఉండదనుకుంటాను' సానుభూతి ప్రకటించింది.

'ఉండకేం ఉంటూనే ఉంటుంది. అయినా విశ్రాంతి ఏం చేసుకుంటాను?" అంది పార్వతి.

'అదేమిటి సంఘసేవ చేయవచ్చుగా' నవ్వుతూ అంది సుభద్రగారు.

పార్వతి ఆ క్షణంలో తన భర్తని పిల్లలని జ్ఞాపకం తెచ్చుకుంది. ఒక్కక్షణం తను లేకపోతే ఎక్కడ పని అక్కడే ఆగిపోతుంది. అంతేకాదు.

అందరూ తనమీద విరుచుకుపడతారు! తనకి తెలియకుండానే పార్వతి నిట్టూర్చింది.

సుభద్రగారు మాట కలపకపోతే అలాగే తన ఆలోచనలలో పడిపోయేదే పార్వతి.

'రేపురాత్రి మీరు, మీ ఆయనా మా యింటికి భోజనానికి రావాలి' అంది సుభద్రగారు.

'ఏమిటి విశేషం?' నవ్వుతూ అడిగింది పార్వతి.

'ఏదైనా విశేషం లేకుంటే రారా? సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దాం' అంది సుభద్రగారు.

'చెప్తాను' అంది పార్వతి.

'చెప్పడంకాదు. రావడమే, అదిగో వచ్చేది నా బస్సే' అంటూ బస్సుకోసం ముందుకి సాగింది సుభద్రగారు. ఆవిడకి అందరూ దారి విడిచారు. సుఖంగా బస్సు ఎక్కేసింది.

పార్వతి కాస్సేపు తల్లితో కబుర్లు చెప్పి బాబిని స్కూలునుంచి తీసుకుని ఇంటికి వచ్చేసింది. ఆ రాత్రి భోజనాలు అయిపోయాయి. కృష్ణమూర్తి సిగరెట్ కాలుస్తూ పేపరు చూసుకుంటున్నాడు. మధ్యలో పార్వతి తమలపాకులు చిలకలు చుట్టి నోటికి అందిస్తోంది.

'రేపు రాత్రి మనం ఎక్కడికి వెడుతున్నామో ఊహించుచూద్దాం' అంది కృష్ణమూర్తితో.

'వెడుతున్నామా? ఎక్కడికి? నాకు క్లబ్బులో బ్రిడ్జి వుంది'

'అయ్యో అలా అంటే ఎలా? వస్తామని చెప్పానే' చిన్నబుచ్చుకుంటూ అంది పార్వతి.

‘ఏమిటీ గొడవ? గత పదేళ్ళలో ఒక్కరోజుకూడా నువ్వు అయ్యో అనడం వినలేదు నేను’ అన్నాడు కృష్ణమూర్తి.

‘టైము లేకపోయింది! పిల్లల్ని కనడానికీ పెంచడానికి సరిపోయింది. అంచేత నీ క్లబ్బు కార్యక్రమాల వివరాలు తెలుసుకోలేకపోయాను!’ వ్యంగ్యంగా అంది పార్వతి. సిగరెట్ క్రిందపారేసి భార్య కేసి వింతగా చూశాడు కృష్ణమూర్తి. ‘ఇప్పుడేమైంది? ఇద్దరూ స్కూల్‌కి వెళ్ళిపోతున్నారుగా?’ అమాయకంగా అన్నాడు.

‘బాబిగాడు సరిగ్గా మూడు గంటలు ఉంటాడు స్కూల్లో. మూడున్నర అయేసరికి నానిగాడు వస్తాడు. వాళ్ళ గోల భరించడానికి ఒకరోజుకి వారంరోజుల శక్తి కావాలి’ అంది పార్వతి.

కృష్ణమూర్తి సన్నగా నవ్వుకున్నాడు. నానిగాడు నా పోలిక. వాడి ఘనత వినడానికి ప్రేక్షకులు కావాలి. నువ్వు వాడి ముఖ్య అతిథివి’ అన్నాడు.

‘పోనీలే ఎక్కడికి వెళ్ళాలని... చెప్పు’ అడిగాడు.

‘పక్కింటి సుభద్రగారు భోజనానికి పిలిచారు’ సగం ఉత్సాహం చచ్చిపోగా అంది పార్వతి.

‘ఆ– నైస్‌గాల్!’ అన్నాడు కృష్ణమూర్తి.

‘గాల్. నా ముఖం. నిరభ్యంతరంగా నా వయస్సు వుంటుంది ఆ పిల్లగారికి!’ అంది ఘాటుగా.

‘పాపం. ఒకర్తెకే ఏం తోచడం లేదు కాబోలు. అలాగే వెడదాం’ అన్నాడు పేపరులో తలదూర్చేస్తూ.

దగ్గిరలో ఏం దొరికితే అది ఆ క్షణంలో కృష్ణమూర్తి మీదికి విసరాలన్నంత కోపం వచ్చింది పార్వతికి. గట్టిగా అరవాలనిపించింది. కాని అవేం చేయలేదు. ‘అంత తోచకుండా లేదులే. కాలక్షేపానికి

సంఘసేవలాంటిది చేస్తూ ఉంటుందట. మరినీ క్లబ్బు మాట?' అడిగింది పార్వతి. 'కబురంపుతానులే. ఇంకో పార్ట్‌నర్‌ని చూసుకుంటాడు' అన్నాడు కృష్ణమూర్తి. 'ఈరోజు బస్సులో కనిపించింది' అన్నాడు. "రేపు రాత్రికి కొత్తచీర కొని వుంటుంది?" హేళనగా అంది పార్వతి. 'మంచి చలాకీ అయిన వ్యక్తి. ఎంత జాగ్రత్తగా డ్రస్ చేసుకుంటుందో చూశావా?' సీరియస్‌గానే అన్నాడు కృష్ణమూర్తి. దాంతో వచ్చింది అసలు చిక్కు.

ఎదుటి స్త్రీని అంత పొగిడితే ఎంత భార్య అయితే మటుకు ఎంతకాలం భరిస్తుంది? విందుకు వెళ్ళినప్పుడు ఎలాగైనా సరే సుభద్రగారిని తలదన్నాలని నిశ్చయించుకుంది పార్వతి.

రాత్రి పిల్లలకి ఇట్టే నిద్రపట్టేసింది పార్వతి లాలిపాటతో.

పార్వతి మెదడు పరిపరివిధాల ఆలోచనలు చేస్తూంది. తనూ ఏమైనా చేస్తే తప్పించి లాభంలేదు అనుకుంది. పెట్లో డబ్బుంది. కాని దానికెంతో అవసరం వుంది. కుర్రాళ్ళకి గుడ్డలు కుట్టించాలి. నానిగాడికి బూట్లు కొనాలి. మధ్యలో పుట్టినరోజులు వస్తాయి. డాక్టరు అవసరాలు వస్తాయి... కాని పార్వతి చెవుల్లో కృష్ణమూర్తి మాటలే మార్మోగుతున్నాయి. 'ఎంత జాగ్రత్తగా డ్రస్సు చేసుకుంటుందో చూశావా?' అన్న అతని మాట ములుకులా పార్వతి హృదయాన్ని దొలిచింది. 'ఖర్చులు ఉండనీ, వాటి గొడవెందుకు?' అని నిశ్చయించుకుంది. 'తెల్లవారనీ' అనుకుని తృప్తిగా నిద్రపోయింది.

మరునాటి ఉదయం పెందరాడే లేచింది పార్వతి. చాలా సింపుల్‌గా చేసి అయిందనిపించింది వంట.

'ఏమిటీ ఒకటే హడావుడిగా ఉన్నావు?' వేళాకోళంచేస్తూ భార్య బుగ్గమీద చిటికె వేశాడు కృష్ణమూర్తి.

'నేను బజారుకి వెడుతున్నాను' క్లుప్తంగా సమాధానం చెప్పింది పార్వతి.

భర్త ఆఫీసుకీ, పిల్లలు స్కూల్‌కీ వెళ్ళారు. పదిగంటలకల్లా వీధితలుపు తాళం వేసింది పార్వతి. తిన్నగా 'వర్ణాలి'కి వెళ్ళింది. చక్కని జరీచీర కొంది. టౌనుకి బస్సు ఎక్కింది. చక్కని సవరం కొంది. ఎన్నాళ్ళనుంచో ఉందా కోరిక – పొడుగ్గా వాలుజడ వేసుకోవాలని. కాని ఈరోజుకి – కావలసిన తెగింపు వచ్చింది.

సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చాక వాళ్ళకి భోజనాలు సిద్ధం చేసింది. నూకాలుని వాళ్ళకి సాయం వుండమంది. నూకాలు ఉట్టినే కూర్చోదు. చక్కగా మల్లెలు, దవనం కలిపి దండ కట్టింది పార్వతికోసం. అందంగా తల దువ్వి వాలుజడ వేసుకుని మాలపెట్టుకుంది. కొత్తచీర కట్టి తగిన పొట్టిచేతుల రవికె తొడిగింది. కళ్ళకు కాటుక దిద్దింది. అందంగా తయారై కృష్ణమూర్తికోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

తండ్రి కారు చప్పుడు కాగానే వీధిలోకి పరుగెత్తారు నానిగాడూ, బాబిగాడూ. 'నాన్నారూ, అమ్మ కొత్తమ్మ' అన్నాడు బాబిగాడు. 'ఔను నాన్నా బ్యూటిఫుల్‌గా వుంది' అన్నాడు నానిగాడు. 'అలాగా చూద్దాం' అంటూ లోపలికి వచ్చాడు కృష్ణమూర్తి. కుర్రవాళ్ళు ఆటలో పడిపోయారు. పార్వతి పడగ్గదిలో అద్దంముందు కూర్చుని చూసుకుంటోంది. 'పార్వతీ' అంటూ లోపలికి అడుగుపెట్టి అలాగే నిలబడిపోయాడు కృష్ణమూర్తి. పోకిరి కుర్రవాడిలాగా ఒక ఈలవేసి భార్య దగ్గరికి వచ్చాడు.

పార్వతి ఎంత అందంగా తయారైందో మనసులో అంత బాధపడుతోంది. కృష్ణమూర్తి ఈ పొగడ్తతో కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. నీరు కమ్మిన కళ్ళతో కృష్ణమూర్తికేసి చూసింది. భార్యని చేతులలోకి తీసుకుని గుండెలకదుముకున్నాడు కృష్ణమూర్తి. ఎప్పుడూ నిశ్చలంగా నిజాన్ని చాటిచెప్పే ఆమె కళ్ళలోకి సమాధానం కోసమో అన్నట్టు చూశాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Addam+Ramalakshmi+Kathalu**

* * *